క్లుప్తంగా

పేదలకు వరం 'కంటివెలుగు'



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

మోమిన్‌పేట: కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మండలంలో చంద్రాయ్‌పల్లి, మక్తతాండలలో కంటివెలుగు కార్యక్రమం చేపట్టగా.. కంటి జబ్బుతో బాధపడే వారు నేత్ర శిబిరాల్లో కంటి పరీక్ష చేయించుకుంటున్నారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు పొంది.. గ్రామాల్లో కంటివెలుగు నిర్వహించడం సంతోషంగా ఉందని, డబ్బులు లేక కంటి జబ్బులతో బాధపడేవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. నేత్ర శిబిరాల్లో రోజుకు 50నుంచి 80మంది వరకు కంటి పరీక్ష చేయించుకుంటున్నారని వైద్యాధికారులు తెలిపారు.

ప్రజా శ్రేయస్సుకోసం పాదయాత్రగా తిరుమలకు



టీటీడీకి పాదయాత్రగా లక్ష్మీపల్లి వాసులు

కొడంగల్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానానికి లక్ష్మీపల్లి గ్రామం నుంచి 25మందికి పైగా భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. ప్రజా శ్రేయస్సు కోసం ఈ యాత్ర చేపట్టినట్లు భక్తులు తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. నిత్యం 35కి.మీ మేర కాలినడక 20రోజుల్లో టీటీడీకి చేరుకుంటామని వెల్లడించారు. ఇందులో వెంకటయ్య, నర్సింహులు, అంగడిరాయిచూర్ కుర్వ పకీరప్ప, ఊరుముందలి పకీరప్ప, చిన్న హన్మప్ప, ఆశప్ప తదితరులు పాదయాత్రగా వెళ్లారు.

జీపీ కార్యదర్శుల సంఘం కమిటీ ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న సంఘం నేతలు

తాండూరు రూరల్: తాండూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కోటబాసుపల్లి కార్యదర్శి లాలప్పను ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతంనగర్ జీపీ కార్యాలయం వద్ద కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్, అధ్యక్షుడిగా లాలప్ప, ప్రధాన కార్యదర్శులుగా ఆనంద్‌రావు, ఉపాధ్యక్షుడిగా అమరేశ్వరి, ఫకీరోజి, కోశాధికారిగా అశోక్, ప్రచార కార్యదర్శిగా బాలకృష్ణను ఎన్నుకున్నారు. మరికొంత మంది పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సన్మానించారు.


జీవాలకు నట్టల మందు తప్పనిసరి



జీవాలకు నట్టల మందు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ జహంగీర్

బంట్వారం: జీవాలకు నట్టల మందు తప్పనిసరిగా వేయించాలని బీరోల్ వెటర్నరీ అసిస్టెంట్ జహంగీర్ అన్నారు. బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్‌లో 1200కు పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు (డీవార్మింగ్) వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాల పెంపకంపై కాపరులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

కుల్కచర్ల: హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లందరూ సంఘటితం కావాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. బుధవారం సాల్వీడు, కుస్మసముద్రం గ్రామాల్లో సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం మనం కలిసికట్టుగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, కర్ణయ్య, శ్రీనివాస్, మైపాల్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ' అసంతృప్తి

- భవనాలకు నిధుల కొరత
- కొడంగల్ మండలానికి 28 హాళ్లు మంజూరు
- ఐదేళ్లలో పూర్తయినవి మూడే..
- మున్నూరు కాపులను విస్మరించిన ప్రభుత్వం



కొడంగల్‌లో పూర్తికాని లింగ బలిజ కమ్యూనిటీ భవనం

కొడంగల్: కమ్యూనిటీ భవనాల నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలాయి. ప్రారంభించి ఐదేళ్లు గడుస్తున్నా.. పూర్తి కావడం లేదు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ మండలంలోని అన్ని సామాజిక వర్గాల వారికి కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసింది. అప్పట్లో ఆర్భాటంగా ప్రారంభించిన భవనాల నిర్మాణం.. నేటికీ పూర్తి కాలేదు. కొడంగల్‌తో పాటు మండల పరిధిలో మొత్తం 28 భవనాలు చేయగా.. ఒక్కోదానికి రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు కేటాయించింది. అయితే అందులో మూడు భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. ఉడిమేశ్వరం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రుద్రారంలో లింగాయత్ కమ్యూనిటీ భవనం, కొడంగల్‌లో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనాలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 12 భవనాల నిర్మాణాలు అసలు ప్రారంభం కాలేదు. 13 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మున్నూరు కాపులకు మొండిచేయి!

నిధుల కొరత కారణంగా భవనాల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఈ ఏడాదైనా నిధులు మంజూరు చేస్తారని ఆయా సామాజిక వర్గాల వారు ఆశగా ఎదురు చూడగా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని నిరాశ చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. మండలంలో అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసిన ప్రభుత్వం.. మున్నూరు కాపులను విస్మరించిందని ఆ సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కొడంగల్‌తో పాటు నియోజకవర్గ పరిధిలో ఒక్క భవనం కూడా మంజూరు చేయలేదన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకొని మున్నూరు కాపుల ఆత్మ గౌరవ భవనానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు కోరుతున్నారు.

> **అన్ని సామాజిక వర్గాలకు..**
>
> 
>
> పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాను. త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు కొడంగల్‌పై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అత్యధికంగా నిధులు మంజూరు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి మేలు చేస్తాం.
>
> – నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడంగల్

ఫిజియోథెరపీతో ఆరోగ్యం మెరుగు

- ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స చేయించాలి
- మండల విద్యాధికారి హరిశ్చందర్



ఫిజియోథెరపి విధానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, ఎంపీడీఓ తదితరులు

పరిగి: ప్రత్యేక అవసరాల పిల్లలు తప్పకుండా చికిత్స చేయించుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. బుధవారం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా చేస్తున్న ఫిజియోథెరపీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి బుధవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స అందిస్తున్నారని, ఫిజియోథెరపి చేయడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా చికిత్స అందించడం ద్వారా త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చికిత్స అనంతరం వైద్యుల సలహాలు తీసుకోవాలని, ఇంటి దగ్గర ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి వ్యాయామాలు చేయించాలో తల్లిదండ్రులకు చూపిస్తారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంఈఓ దయానంద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు



నాగారంలో రోడ్డు పక్కనే వట్టిపోయి కనిపిస్తున్న నీటి తొట్టి

పట్టించుకోని స్థానిక ప్రజాప్రతినిధులు

ధారూరు: పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలు, తండాల్లోని తొట్లలో నీరు నింపి వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని చోట్ల ఎప్పుడో నింపిన నీరు నాచుపట్టి మురుగు నీటిని తలపిస్తున్నాయి. ఆ నీటిని తాగిన పశువులు, పక్షులు అనారోగ్యం పాలవుతున్నాయి. ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ నీటితొట్లను శుభ్రం చేయించాలన్న ఆలోచన సర్పంచు, కార్యదర్శికి లేదని, చెప్పినా వాటిని పట్టించుకునే వారు లేరని ఆరోపించారు. ఎండలు ముదురుతున్నందున్న తొట్లను శుభ్రం చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపండి

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవ రెడ్డి



కస్తూర్బా పాఠశాలలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డి

దోమ: ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలని పీఆర్టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు బొంపల్లి, ఐనాపూర్, దాదాపూర్, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో ఉపాధ్యాయులందరూ తనకు మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా 317 జీవో ఆధారంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేసేలా కృషి చేస్తానని తెలిపారు. 398 జీవో వర్తించిన ఉపాధ్యాయులకు నేషనల్ ఇంక్రిమెంట్, పెండింగ్ డీఏలు, ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు పారదర్శకంగా జరిగేలా చూస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కేశవులు, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర బాధ్యుడు గోపాల్, పురందాస్, హరిలాల్, కృష్ణయ్య, ప్రకాశ్, శివశంకర్, బీమ్యానాయక్, ప్రవీణ్‌సింగ్, వెంకటయ్య, ఖదీర్, చంద్రశేఖర్‌రెడ్డి, వీరప్ప, ఎల్లారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత

- గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండల ఇందూరు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రవీణ్‌పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పటేల్ వీరారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఊరుకో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా.. సమాజానికి చేరువగా చేస్తాయని వెల్లడించారు. ప్రతి ఆటలో క్రీడాకారులు ముందుండాలన్నారు. ఇక్కడ నిర్వహించిన టోర్నీలో 70 జట్లు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, క్రీడాకారులకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. క్రీడల్లో గెలపోటములు సహజమన్నారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకుడు ప్రవీణ్ పటేల్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, తాండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, సర్పంచ్ పద్మమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అప్పు(నహీం), వీరశైవ సమాజం అధ్యక్షుడు శ్రీశైలం, పెద్దేముల్ రైతుసేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్, మొగులప్ప, మండల నాయకులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, బందెప్ప, వెంకట్, ఆర్గనైజర్లు రాజు, అశోక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్

- వాటిని కొట్టొద్దు.. మీరు పరుగుతీయొద్దు
- శునకాల బెడద ఉంటే సమాచారం ఇవ్వండి
- మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర

వికారాబాద్ అర్బన్: వీధి కుక్కల పట్ల పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల, సిద్దార్థ, సెయింట్ జూడ్స్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కుక్కలు దగ్గరికి వచ్చినప్పుడు పరుగెత్తే ప్రయత్నం చేయవద్దని, వేగంగా కూడా నడవవద్దని సూచించారు. కుక్కలపై రాళ్లు వేయడం, కట్టె విసరడం వంటివి చేస్తే మనల్ని కరిచే ప్రమాదం ఉందన్నారు. కుక్క తన పిల్లలతో ఉన్నప్పుడు, ఏదైనా పదార్థం తింటునప్పుడు కొట్టే ప్రయత్నం చేయొద్దని వెల్లడించారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద లేకుండా వాటిని పట్టుకొని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేసి వదిలేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ మోయినొద్దీన్ పాల్గొన్నారు.

మర్పల్లి ఎంపీడీఓగా రాజమల్లయ్య



మర్పల్లి: మర్పల్లి ఎంపీడీఓగా రాజమల్లయ్యను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజమల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగులు సమయ పాలన పాటించి, తమ విధులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రత్యేక చొరవ తీసుకొని పారదర్శకంగా పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చూస్తానని తెలిపారు.

ప్రజా సంక్షేమమే రేవంత్‌రెడ్డి యావ

- ఆయనపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు
- యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రితిక్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ పార్టీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నారని, అదిచూసి ఓర్వలేని కొందరు దాడులకు పాల్పడుతున్నారని, అలా చేస్తే సహించేది లేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లాలో మంగళవారం రేవంత్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక ఆయనపై కోడిగుడ్లు, టమాటలతో దాడి చేశారని ఆరోపించారు. అలా చేయడం పిరికిపంద చర్య అని, దాడులకు ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలను ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు జగన్, సురేందర్, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'సీఓఈ'అర్హత పరీక్షకు ముందే రావాలి

కొడంగల్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ ఇంటర్మీడియట్ అర్హత పరీక్షకు సకాలంలో హాజరుకావాలని ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. కొడంగల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రానికి కేటాయించిన అభ్యర్థులు.. చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలోని ప్రజ్ఞభారతీ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ఈ నెల 5న ఆదివారం ఉదయం 10గంటల నుంచి సీఈఓ2023 ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొడంగల్‌లో కొనసాగే గురుకుల పాఠశాల.. ప్రస్తుతం చేవెళ్ల ప్రజ్ఞాభారతి ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న కారణంగా ముడిమ్యాల పరీక్షా కేంద్రంలోనే పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు హాజరుకావాలని, విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు. వివరాలకు 79950 10623 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ వెంకటేశ్

కుల్కచర్ల: నర్సరీ పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీఓ వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై ఊసెత్తని కేంద్రం'

తాండూరు టౌన్: ఎస్సీ కులాల వర్గీకరణ కోసం ఉద్యమాలు చేస్తూ నేలకొరిగిన మాదిగ అమరవీరులకు మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా వర్గీకరణ ఊసెత్తడం లేదని విమర్శించారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. మాట తప్పి మాదిగ ఉపకులాలను మోసం చేసిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల సమయంలో దళితవాడల్లో ఓట్లు అడగడానికి వస్తే తప్పకుండా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ తాండూరు మండల ఇన్‌చార్జి నర్సింహులు, నాయకులు శ్రీకాంత్, బుగ్గప్ప, మహేందర్, బాలరాజు, శ్రీనివాస్, వెంకటేశ్, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తం



బొంరాస్‌పేట: మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

అవగాహన కార్యక్రమంలో పోలీసులు

బొంరాస్‌పేట: సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంకర్ చెప్పారు. మండల కేంద్రంలోని భూలక్ష్మి చౌరస్తాలో బుధవారం స్థానికులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దని, ఆఫర్ల పేరిట ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని చెప్పారు. అంతే కాకుండా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తంగా ఉంటూ.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తాజాగా ఓ ఉపాధ్యాయురాలు నష్టపోయిన సంఘటనను గుర్తు చేశారు. మొబైల్ ద్వారా లావాదేవీలు జరపొద్దని చెప్పారు.

బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దు

మర్పల్లి: సైబర్ నేరగాళ్లు తమ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం చేస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని మర్పల్లి ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ సూచించారు. బుధవారం ఠాణా ఎదుట నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే లిఫ్టు చేయొద్దని, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు.

ధారూరు 11స్టార్ టీం విజేత



విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న హఫీజ్‌ఖురేషి

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో 10 రోజులగా నిర్వహిస్తున్న ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ధారూరు 11స్టార్ టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్‌ఖురేషి స్పాన్సర్ చేసిన రూ.5 వేలు, జ్ఞాపికను అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన ధారూరు ఏ11 టీంకు అబ్దుల్ రహీం స్పాన్సర్ చేసిన రూ. 2,500లు, షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారు.

తడిపొడి చెత్తను వేరుగా తరలించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీఓ కరీం

కుల్కచర్ల: ప్రజల నుంచి సేకరించిన చెత్తను తడి,పొడిగా వేరుచేసి డంపింగ్ యార్డులో వేయాలని ఎంపీఓ కరీం అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్ డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డులను ఉపయోగంలోకి తీసుకురావాలని చెప్పారు. సేకరించిన చెత్తను తడిపొడిగా వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చునని తెలిపారు. పారిశుద్ధ్య పనులపై కార్యదర్శులు, సర్పంచులు నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'సంఘం' సమస్యల పరిష్కారానికి వేదిక



నియామకపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ

పరిగి: సంఘం సమస్యల పరిష్కారానికి వేదిక అవుతుందని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా అమృత, బుచ్చయ్య, కోశాధికారిగా వెంకటగిరి, ప్రచార కార్యదర్శులుగా శివరామకృష్ణ, వాణిశ్రీని నియమించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ సంఘాలు సంఘటితంగా పనిచేయాలని చెప్పారు. అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.